చెంగీజ్ ఖాన్! చరిత్రతో పరిచయం ఉన్నా లేకపోయినా ఆ పేరు విననివారు అరుదు. క్రూరమైన రాజుగానే కాదు... సామ్రాజ్యాన్ని విస్తరించడంలోను, వ్యూహాలను రచించడంలోనూ తనకు తానే సాటి. చెంగీజ్ ఖాన్ తర్వాత ఆ ఉధృతిని కొనసాగించిన వారసుడు తన మనవడు కైదు. ఓపక్క తన రాజ్యాన్ని కాపాడుకోవడమే కాదు, చెంగీజ్ ఖాన్ మరో వారసుడైన కుబ్లయి ఖాన్‌తో ఆధిపత్య పోరులోనూ కైదు తలమునకలుగా ఉండేవాడు. ఆ పరిస్థితుల్లో తనకు అండగా నిలిచిన వ్యక్తి 'కుటులున్'. ఎడారి ప్రాంతంలో, కరకు సైనికుల మధ్య, మగవాడి మాటే వినిపించాలనే పరిస్థితుల్లో... కైదు బిడ్డ కుటులున్ గుర్రపు స్వారీ దగ్గర నుంచి కత్తియుద్ధం వరకు ప్రతి యుద్ధకళలోనూ ఆరితేరింది. అన్నిటికంటే ప్రత్యేకం ఏమిటంటే... శత్రువుతో నేరుగా తలపడే మల్ల యుద్ధంలో కుటులున్‌ని కొట్టినవాడు మంగోలియాలోనే లేడట. తన తండ్రితోపాటు నేరుగా యుద్ధభూమికి వెళ్లే కుటులున్... ఎన్నో సమరాల్లో తనకు విజయాన్నందించింది. యుద్ధంలోనే కాదు యుద్ధతంత్రం రచించడంలోనూ, రాజ్యాన్ని పాలించడంలోనూ కుటులున్ సలహాలను కైదు తు.చ. తప్పకుండా పాటించేవాడు. తనకు ఎంతోమంది మగపిల్లలు ఉన్నా... కుటులున్‌నే తన సింహాసనానికి వారసురాలిగా ప్రకటించాడనే కథ వినిపిస్తుంది.

అంతటి శక్తిమంతురాలిని సైతం చరిత్ర విస్మరించింది. ప్రతి రాజు గురించీ, తను స్థాపించిన వంశాల గురించీ, అందులోని సవాలక్ష రాజుల గుణగణాల గురించీ వివరించే చరిత్రకారులు కుటులున్ ఉన్న విషయాన్నే మర్చిపోయారు. మార్కోపోలో తన యాత్రాసాహిత్యంలో కనుక కుటులున్ గురించి చెప్పి ఉండకపోతే... అసలు అలాంటి వ్యక్తి ఉందనే విషయం కూడా ఎవరికీ తెలిసి ఉండేది కాదు. వైద్యం నుంచి విజ్ఞానం వరకు మానవజాతి మనుగడ సాగించిన ప్రతీ రంగంలోనూ ఇలాంటి ఉదాహరణలు కనిపిస్తూనే ఉంటాయి.

**అణువణువునా అలసత్వం!**

ఈమధ్య వచ్చిన ఓపెన్‌హైమర్ సినిమాతో అందరికీ అణుబాంబు వెనుక ఉన్న ప్రయత్నాల గురించి తెలిసింది. అందుకోసం ఆరంభించిన 'మేన్‌హటన్ ప్రాజెక్ట్' గురించీ తెలిసింది. అయితే ఇందులో షెన్ షియంగ్ గురించి ఎవరికీ తెలియనే తెలియదు. నిజానికి షెన్ లేకపోతే ఈ ప్రాజెక్ట్ అసలు ముందుకు కదిలేదే కాదు. ఐన్‌స్టీన్ సైతం అసాధ్యం అనుకున్న క్వాంటం ఎంటాగిల్‌మెంట్ అనే సిద్ధాంతాన్ని షెన్ నిరూపించారు. యురేనియంని వేర్వేరు ఐసోటోప్స్‌గా విడగొట్టారు. విచిత్రం ఏమిటంటే... అణువుల మీద తను చేసిన ఓ పరిశోధనకుగాను తన శిష్యులైన ఇద్దరు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి దక్కింది కానీ, తన పేరు కూడా బయటకు రానివ్వలేదు. ప్రత్యేకించి విన్నప్పుడు ఈ వివక్ష మరీ కఠినంగా ఉండవచ్చు కానీ... కాస్త లోతుగా గమనిస్తే చరిత్ర మరుగుపరచిన ఇలాంటి మహిళా శాస్త్రవేత్తల జాబితా చాలా పెద్దగానే కనిపిస్తుంది. వాటిలో ప్రముఖంగా వినిపించే మరో పేరు రోసాలిండ్ ఫ్రాంక్లిన్.

మన శరీరం జన్యువులు అనే నిచ్చెనలాంటి పదార్థాలతో నిర్మితం అయ్యిందని ప్రతిపాదించడమే కాకుండా, ఏకంగా వాటి ఫొటోనూ తీశారు రోసాలిండ్. అంతేకాదు! తను చేసిన పరిశోధనల ఆధారంగానే విషవాయువులను ఎదుర్కొనే గ్యాస్ మాస్కులను సైన్యం రూపొందించగలిగింది. వైరస్‌ల మీద రోసాలిండ్ చేసిన సూత్రాల ఆధారంగా పరిశోధన చేసినవారికీ నోబెల్ దక్కింది. తను మాత్రం అనామకంగా మిగిలిపోయింది.



ఇప్పుడు మనం రోజూ తల్చుకునే భూతాపానికి కారణమైన 'గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్'ను కూడా ఓ మహిళా శాస్త్రవేత్తే కనుగొన్నారు. తన పేరు యూనిస్ ఫుట్. ఓ వైజ్ఞానిక సమావేశంలో మహిళలకు ప్రవేశం లేకపోవడంతో తన స్నేహితుడిని బతిమాలి, తన సిద్ధాంతాన్ని అక్కడ వినిపించారు యూనిస్. ఇంత జరిగినా... అదే సిద్ధాంతాన్ని మూడేళ్ల తర్వాత ప్రతిపాదించిన ఓ మగ శాస్త్రవేత్త పేరు మీదుగా గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ చలామణి అవుతున్నది.

వీళ్లే కాదు! క్షయవ్యాధికి, ఆ మాటకు వస్తే ఏ వ్యాధికైనా ఉండే మందును... నేరుగా రక్తంలోకి కలవగలిగే ఇంజెక్షన్‌లా మార్చే పద్ధతిని కనుగొన్న అలిస్ బాల్; మనుషుల్ని అంతరిక్షంలోకి పంపడంలో నాసాకు ఉపయోగపడేలా సిద్ధాంతాలు రూపొందించిన గణిత శాస్త్రవేత్త కేథరిన్ జాన్సన్; ఇచ్చిపుచ్చుకోవడంలో మనిషితత్వం గురించి అనూహ్యమైన సిద్ధాంతాలు వెలువరించిన ఆర్థికవేత్త ఎలినార్ ఆస్ట్రామ్; పల్సర్స్ అనే వింత తారలను కనుగొన్న జోసెలిన్ బెల్... వీళ్లందరి పేర్లూ విజ్ఞానశాస్త్రంలో ఉన్నవారికి కూడా తెలియకపోవచ్చు. పైగా వీళ్లలో ప్రతి ఒక్కరిదీ ఓ కన్నీటి గాథ. కేథరిన్ ఓ ల్యాబ్ ప్రమాదంలో చనిపోతే... ఆమె సిద్ధాంతాన్ని తన పేరున ఆపాదించుకున్నాడు ఓ ప్రబుద్ధుడు. ఎలినార్ సిద్ధాంతాలన్నీ ఆచరణలో అద్భుతాలు చేశాక కానీ తనకు గుర్తింపు రాలేదు. మైళ్ల కొద్దీ పేపర్లను పరిశీలించిన జోసెలిన్ పల్సర్లను కనుగొంటే, తన పై అధికారికి నోబెల్ దక్కింది.

ఈ వివక్ష కేవలం శాస్త్రవేత్తల విషయంలో మాత్రమే కాదు. మొదట్లో చెప్పుకొన్నట్టుగా రాణుల దగ్గర నుంచీ రచయిత్రుల వరకూ మహిళల ప్రతిభను ఓరకంటితో కూడా చూడని నిర్లక్ష్యం చరిత్రపుటల్లో స్పష్టంగా కనిపిస్తుంది. చారిత్రక తవ్వకాల్లో బయటపడిన తొలి రచన 'ఎన్‌హెడున' అనే మహిళదే అని చెబుతున్నారు. క్రీస్తుపూర్వం రెండువేల సంవత్సరంలోనే తను మట్టి పలకల మీద రాసిన పద్యాలు, స్తోత్రాలు బయట




పడ్డాయి. మార్కోపోలో కంటే వెయ్యేళ్ల ముందుగా యాత్రాసాహిత్యాన్ని రాసిన ఎగేరియా గురించీ ఎవరికీ తెలియదు. టిబెట్ మీద చైనీయుల దురాక్రమణను అడ్డుకునేందుకు 600 మంది వీరులతో కదం తొక్కిన 'అని పచెన్' ఇప్పటికీ మనకు అపరిచితురాలే.

**మన సంగతేంటి?**

భారతీయ సమాజంలో స్త్రీల పట్ల వివక్ష గురించి సానుకూలంగానూ, ప్రతికూలంగానూ